PRABHATA GAMANAM
# ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక
జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?
విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...
ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.
ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 219 | సంపుటి 4 | ఆదివారం | 26-04-2026 | పేజీలు 4 | వెల 3/- | ఎడిటర్ పి. రవిచంద్ర

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పుడు 'దేవుళ్లు'గా కొలవబడిన ఆర్ఎంపీల వ్యవస్థ నేడు కొందరి స్వార్థం వల్ల 'మృత్యుపాశం'గా మారుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా పల్లెల్లో సాగుతున్న అడ్డగోలు వైద్యం సామాన్య ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావాల్సిన కొందరు ఆర్ఎంపీలు, తమ పరిధి దాటి హైడోస్ యాంటీబయోటిక్స్ మరియు స్టెరాయిడ్లను విచ్చలవిడిగా వాడుతూ రోగుల శరీరాలను అనారోగ్యాల పాలు చేస్తున్నారు. అయితే, ఈ 'చికిత్స' వెనుక ఉన్న అసలు దందా మాత్రం పట్టణాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లతో సాగుతున్న 'కమిషన్ల ఒప్పందం'. ఒక రోగిని ఆసుపత్రిలో చేర్పించినందుకు బిల్లులో ఏకంగా 40 నుండి 50 శాతం వరకు కమిషన్ దండుకుంటూ, పేదల కష్టార్జితాన్ని జలగల్లా పీలుస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ తనిఖీలను గాలికొదిలేయడంతో, ఈ కమిషన్ల మాఫియా పల్లెల్లో అప్రతిహతంగా కొనసాగుతోంది. —వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం



- ఒకప్పుడు నిస్వార్థ సేవ .. నేడు కాసుల వేట
- పరిమితికి మించి హై డోస్ మందులు
- అవసరం లేకున్నా ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్
- బిల్లులో యాభై శాతం ఆర్ఎంపీల జేబులోకి
- టెస్టులు చేయించుకున్నా.. మందులు కొన్నా కమిషనే..
- ఆర్ఎంపీలను ప్రోత్సహిస్తున్న కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

ఆర్ఎంపీల ఇష్టారాజ్యం !

2

## నాసిరకం వైద్యం..
# ప్రాణాలతో చెలగాటం!



### 'తెలంగాణ రాష్ట్ర సేన'
# టీఆర్ఎస్ ఆవిర్భావం..

- కేసీఆర్ పై కవిత యుద్ధప్రకటన!
- మేడ్చల్ గడ్డపై కొత్త పార్టీ పేరు ప్రకటించిన కవిత..
- బీఆర్ఎస్ కు 'ఆత్మ' లేదని ధ్వజం
- నేనూ ఆ పాపంలో భాగమే..
- తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు!

2

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. కల్వకుంట్ల కవిత తన తండ్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ ఎస్ తో తెగతెంపులు చేసుకుని, కొత్త రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. శనివారం మేడ్చల్ జిల్లా మునీరాబాద్ లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో తన పార్టీ పేరును "తెలంగాణ రాష్ట్ర సేన" (TRS)గా ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా చేసిన ప్రసంగంలో కేసీఆర్ తీరుపై విమర్శలు గుప్పిస్తూ, తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### నిశ్చితార్థం జరిగిన
# యువతి దారుణ హత్య

- అనుమానంతో బావిలోకి నెట్టి చంపిన కాబోయే భర్త..
- ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం..
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

04






# ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త మలుపు..

- 'సిట్' ముందుకు శివకుమార్!
- మే 28న విచారణకు హాజరుకావాలని నోటీసులు..
- యుగతులసి ఫౌండేషన్ చైర్మన్ కు పిలుపు
- కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా విచారణ..
- కీలక వివరాలు రాబట్టేందుకు అధికారుల సిద్ధం

2

# బయ్యారంలో అగ్నిప్రళయం

- 10 ఎకరాల్లో మొక్కజొన్న బూడిద!
- నోటికాడి బువ్వను దూరం చేసిన అగ్నికీలలు..
- కోతకొచ్చిన పంట కళ్లముందే దహనం
- 50 బోర్ల పైపులు, స్టార్టర్లు కూడా దగ్ధం..
- కన్నీరుమున్నీరవుతున్న 15 మంది అన్నదాతలు

2



ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
వరంగల్, ఆదివారం, 26-04-2026




# నాసిరకం వైద్యం..
# ప్రాణాలతో చెలగాటం!

- ఆర్ఎంపీల ఇష్టారాజ్యం!
- ఒకప్పుడు నిస్వార్థ సేవ ..నేడు కాసుల వేట
- పరిమితికి మించి హై డోస్ మందులు
- అవసరం లేకున్నా ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్
- బిల్లులో యాభై శాతం ఆర్ఎంపీల జేబులోకి
- టెస్టులు చేయించుకున్నా..మందులు కొన్నా కమిషనే..
- ఆర్ఎంపీలను ప్రోత్సహిస్తున్న కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

**ఉమ్మడి వరంగల్ బ్యూరో (ప్రభాత గమనం):**

ఒకప్పుడు పల్లెటూరులో వైద్యుడు అందుబాటులో లేని సమయంలో ఆర్ఎంపీలే ప్రజలకు దిక్కయ్యారు. అత్యవసర పరిస్థితులలో ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడే వారు.వైద్య సేవతో ప్రజల మనసులో దైవ సమానులుగా నిలిచారు. కానీ కాలక్రమమైన ఆ సేవా దృక్పథం కనుమరుగై వైద్యం ఇప్పుడు భారీ వ్యాపారంగా మారింది.వరంగల్, మహబూబాబాద్,జనగాం జిల్లాలోని గ్రామాల్లో కొందరు ఆర్ఎంపీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, వచ్చి రాని వైద్యంతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నిబంధనల ప్రకారం కేవలం ప్రథమ చికిత్సకు మాత్రమే పరిమితం కావలసిన ఆర్ఎంపీలు డిగ్రీలు లేకపోయినా హై డోస్ యాంటీ బయోటిక్స్,స్టెరాయిడ్స్ విచ్చలవిడిగా వాడుతూ రోగుల శరీరాలను అనారోగ్యాల పాలు చేస్తున్నారు. వారి అసలు దందా మాత్రం ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్స్ సెంటర్లతో సాగుతుంది. గ్రామాల్లో ఎవరికి ఏ చిన్న సమస్య వచ్చినా తమకు భారీ కమిషన్లు ఇచ్చే పట్టణాల్లోని ఆసుపత్రులకే రిఫర్ చేస్తున్నారు. ఒక రోగిని తీసుకెళ్లేందుకు ఆసుపత్రి బిల్లులో 40 నుండి 50 శాతం వరకు కమిషన్ దండుకుంటూ పేదల రక్తాన్ని జలగల్లాగా పీల్చుకుంటున్నారు. ఈ అడ్డగోలు వైద్యంపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులు చేసిన చర్యలు మాత్రం శూన్యం. తనిఖీలు నిర్వహించి ఇటువంటి ఆస్పత్రులను మూసి వేయ వలసిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారు అని ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఒకప్పుడు గ్రామాల్లో వైద్యుడు అందుబాటులో లేని సమయంలో ఆర్ఎంపిలే దిక్కైయ్యారు .అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స ప్రాణాలు కాపాడే వారిని ప్రజలు వారిని దైవ సమానులుగా భావించేవారు. కానీ కాలక్రమమైన పరిస్థితి మారి పోయింది. సేవా దృక్పథం పోయి వ్యాపార ధోరణి పెరిగింది .నేడు పల్లెల్లో కొందరు ఆర్ఎంపీలు ఇస్తారాజ్యంగా వ్యవహరిస్తూ వచ్చిరాని వైద్యంతో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

### -ప్రైవేట్ ఆస్పత్రులతో "కమిషన్ "బంధం...

ఆర్ఎంపీల అసలు దందా ప్రైవేట్ ఆస్పత్రులతో సాగుతుంది. గ్రామాలలో ఎవరికైనా చిన్న ఆపరేషన్ లేదా సీరియస్ సమస్య ఉందంటే చాలు.. తమకు కమిషన్ ఇచ్చే పట్టణాల్లోని ప్రైవేట్ ఆస్పత్రికి పేషంట్లను ప్రిఫర్ చేస్తున్నారు. ఇలా పేషెంట్ ను తీసుకు వెళ్లినందుకు ఆస్పత్రి యాజమాన్యం నుంచి ఆర్ఎంపి లకు 40 నుంచి 50 శాతం వరకు కమిషన్ అందుతుంది. ఈ కమిషన్ల కోసం అవసరం లేకపోయినా పేషెంట్లను భయపెట్టి కార్పొరేట్ ఆసుపత్రులకు తరలిస్తున్నారు. ఆస్పత్రుల యజమాన్యాలు సైతం ఆర్ఎంపీలు తీసుకువచ్చిన కేసులకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారు.

### -పరిమితికి మించి వైద్యం...

నిబంధనల ప్రకారం ఆర్ఎంపి లు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలి. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. డిగ్రీలు లేకపోయినా.... హై డోస్ యాంటీబయోటిక్స్ వాడటం, స్టెరాయిడ్స్ ఇవ్వడం , గ్లూకోస్ బాటిల్లు ఎక్కించడం వంటి పనులు చేస్తున్నారు. జ్వరం, దగ్గు అని వారి వద్దకు వెళ్ళితే చాలు. .. కారణం తెలుసు కోకుండానే విచ్చలవిడిగా ఇంజక్షన్లు గుచ్చుతున్నారు. ఈ అడ్డగోలు వైద్యం వల్ల చాలామందిలో కిడ్నీలు దెబ్బ తినడం , రియాక్షన్ కావడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో పేషెంట్ ను పెద్ద ఆసుపత్రికి తరలించవలసిన సమయంలోను వీళ్ళ వచ్చిరాని వైద్యం చేసి రోగుల ప్రాణాల మీదకు తెస్తున్నారు.

### -టెస్టుల పేరిట దోపిడీ...

కేవలం ఆస్పటల్ అడ్మిషన్ లే కాకుండా, డయాగ్నస్టిక్ సెంటర్ల తోనూ వీరికి లోపాయి కార ఒప్పందలు ఉన్నాయి. సాధారణ జ్వరం వచ్చిన వేల రూపాయల విలువచేసే రక్త పరీక్షలు , స్కాన్లు చేస్తున్నారు. ప్రతి టెస్ట్ లోను ఆర్ఎంపీలకి నిర్దేశిత శాతం కమిషన్ అందుతుంది. అమాయక ప్రజల నమ్మకాన్ని మీరు పెట్టుబడిగా మార్చుకుంటున్నారు. కొన్నిచోట్ల మందుల షాపుల నుంచి కూడా వీరికి కమిషన్లు అందుతుండడం గమనార్హం. .

### -ఆసుపత్రులకు వీరిపైనే నమ్మకం...

పట్టణాల్లోని చాలా ప్రైవేట్ ఆస్పత్రులు కేవలం ఈ ఆర్ఎంపీలు తీసుకొచ్చి పేషంట్ల మీదనే నడుస్తున్నాయి. దీంతో ఆస్పత్రిలో డాక్టర్ కంటే ఈ మధ్యవర్తిగా ఉండే ఆర్ఎంపీల మాటే వేదంగా మారుతుంది. పేషెంట్ బంధువులకు బిల్లు విషయం అర్థం కాకుండా చేయడం ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి బిల్లును పెంచడం వంటివి వీరి కనుసన్నల్లోనే జరుగుతున్నాయి. ఫలితంగా పేదల కుటుంబాలు అప్పులోపాలై వీధిన పడుతున్నారు.

### -నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు...

గ్రామాల్లో సాగుతున్న ఈ అక్రమ వైద్యంపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఫిర్యాదులు అందుతున్న చర్యలు మాత్రం శూన్యం తనిఖీలు నిర్వహించి అడ్డగోలు వైద్యం చేసే ఆసుపత్రులను సీజ్ చేయవలసిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్ఎంపీల పరిధిని నిర్దేశించి కమిషన్ల దందా చేస్తున్న ఆసుపత్రులపై ఉక్కు పాదం మోపాలని బాధితులు కోరుకుంటున్నారు. అలాగే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు, శాఖపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు ప్రజలు కోరుతున్నారు.



# ఫోన్ ట్యాపింగ్‌లో కొత్త మలుపు..

- 'సిట్' ముందుకు శివకుమార్!
- మే 28న విచారణకు హాజరుకావాలని నోటీసులు..
- యుగతులసి ఫౌండేషన్ చైర్మన్ కు పిలుపు
- కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా విచారణ..
- కీలక వివరాలు రాబట్టేందుకు అధికారుల సిద్ధం

**హైదరాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత గమనం):**

తెలంగాణ రాజకీయ, అధికార వర్గాలను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో సాక్ష్యాధారాల సేకరణను వేగవంతం చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (SIT), తాజాగా యుగతులసి ఫౌండేషన్ చైర్మన్, టీటీడీ మాజీ సభ్యుడు కె. శివకుమార్‌కు నోటీసులు జారీ చేసింది. మే 28వ తేదీన బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ICCC)లో విచారణకు హాజరుకావాలని అధికారులు ఆయనను ఆదేశించారు.

### బాధిత జాబితాలో ఉన్నారా?

గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నేతలు, వ్యాపారవేత్తలతో పాటు పలువురు ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలపై సిట్ లోతుగా దర్యాప్తు చేస్తోంది. శివకుమార్ పేరు ట్యాపింగ్ బాధితుల జాబితాలో ఉందా? లేదా ఆయనకు ఈ వ్యవహారంతో ఏవైనా ఇతర సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో అధికారులు ప్రశ్నించనున్నారు. ఈ కేసులో ఇప్పటికే పలువురు ఉన్నత స్థాయి పోలీసు అధికారులు అరెస్ట్ కాగా, శివకుమార్ ఇచ్చే స్టేట్‌మెంట్ ద్వారా మరిన్ని కీలక రహస్యాలు బయటకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

### విచారణ నలుదిశలా..

ఇప్పటికే రాజకీయ ప్రముఖులు, మాజీ మంత్రులకు నోటీసులు ఇస్తున్న తరుణంలో శివకుమార్‌ను పిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఎఫ్ఎస్ఎల్ (FSL) నుంచి వచ్చిన డేటా, నిందితుల స్టేట్‌మెంట్ల ఆధారంగా సిట్ తన విచారణను సమగ్రం చేస్తోంది. శివకుమార్ విచారణ అనంతరం ఈ కేసులో మరికొంత మంది కీలక వ్యక్తులకు నోటీసులు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. గత రెండేళ్లుగా సాగుతున్న ఈ దర్యాప్తులో మే 28న జరగబోయే విచారణ అత్యంత కీలకం కానుంది. శివకుమార్ వెల్లడించే విషయాలు ఎవరి మెడకు చుట్టుకుంటాయో అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

# ఆర్టీసీ కార్మికులను పొట్టన పెట్టుకున్న పాపం కేసీఆర్‌దే

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 25, ప్రభాత గమనం:**



బీఆర్ఎస్ హయంలో అనేక మంది ఆర్టీసీ కార్మికులను పొట్టన పెట్టుకున్న పాపం కేసీఆర్‌దేనని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆర్టీసీ కార్మికుల గురించి మాట్లాడటానికి బీఆర్ఎస్ నేతలకు ఏం అర్హత ఉందని ఆయన ప్రశ్నించారు. కార్మికులతో సామరస్య పూర్వకంగా చర్చలు జరిపి, సమస్యలను పరిష్కరించడం ప్రజాస్వామ్య పాలన లక్షణమని పేర్కొన్నారు. శనివారం గాంధీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. '2028లో మెజార్టీ మైనారిటీ మెంబర్స్ కి టికెట్స్ ఇస్తాం. మైనారిటీ విభాగాన్ని బలోపేతం చేయాలి. కాంగ్రెస్ పార్టీ చరిత్రాత్మకమైన పార్టీ. అమలు కానీ హామీలు ఇచ్చి మోదీ అధికారంలోకి వచ్చారు. అంబానీ, అదానీ ఆస్తులు అమాంతం పెరిగిపోయాయి. మోదీ ప్రభుత్వంలో పేదవారు పేదవారిగానే ఉన్నారు. భారత్ జోడో యాత్రతో రాహుల్ గాంధీ దేశాన్ని సమూలంగా చదివారు. తెలంగాణలో ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగుతోంది. విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లాల్లో పర్యటించి సమావేశాలు ఏర్పాటు చేసి.. మైనారిటీ విభాగాన్ని బలోపేతం చేయాలని ఇర్ఫాన్ అలీకి సూచించాం' అని తెలిపారు.

# భార్యను చంపి భర్త ఆత్మహత్య

- సదాశివపేటలో దారుణం:

**సదాశివపేట, ప్రభాత గమనం:**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని సిద్ధాపూర్ కాలనీలో శనివారం ఘోర కలి చోటుచేసుకుంది. క్షణికావేశం, అనుమానం రెండు నిండు ప్రాణాలను బలితీసుకున్నాయి. భార్యను అత్యంత దారుణంగా చంపిన భర్త, ఆపై తానూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధాపూర్ కాలనీకి చెందిన జీవరత్నం, రాణి దంపతుల మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. భార్య రాణి ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న జీవరత్నం, శనివారం గొడవ ముదరడంతో ఆగ్రహం తట్టుకోలేకపోయాడు. ఇంట్లోని రోకలిబండతో రాణి తలపై బలంగా మోదడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది.

### భయంతో భర్త ఆత్మహత్య..

భార్య రక్తపు మడుగులో పడి ఉండటం చూసి ఆందోళనకు గురైన జీవరత్నం, పోలీసులకు దొరికిపోతాననే భయంతో అదే ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అనుమానం పెనుభూతమై ఒకే కుటుంబంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి.



## 'తెలంగాణ రాష్ట్ర సేన'
# టీఆర్ఎస్ ఆవిర్భావం..

- కేసీఆర్ పై కవిత యుద్ధప్రకటన!
- మేడ్చల్ గడ్డపై కొత్త పార్టీ పేరు ప్రకటించిన కవిత..
- బీఆర్ఎస్ కు 'ఆత్మ' లేదని ధ్వజం
- నేనూ ఆ పాపంలో భాగమే..
- తెలంగాణ ప్రజలకు బహిరంగ క్షమాపణలు!

**మేడ్చల్/హైదరాబాద్ (ప్రభాత గమనం):**

తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. కల్వకుంట్ల కవిత తన తండ్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్‌తో తెగతెంపులు చేసుకుని, కొత్త రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. శనివారం మేడ్చల్ జిల్లా మునీరాబాద్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో తన పార్టీ పేరును "తెలంగాణ రాష్ట్ర సేన" (TRS) గా ఆమె ప్రకటించారు. ఈ సందర్భంగా చేసిన ప్రసంగంలో కేసీఆర్ తీరుపై విమర్శలు గుప్పిస్తూ, తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### తండ్రిపైనే తిరుగుబావుటా..

"కేసీఆర్ మారిపోయారు.. ఆయనకు అధికారం మీద మమకారం పెరిగి, ప్రజల మీద మమకారం తగ్గింది" అని కవిత విమర్శించారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని తాను ప్రశ్నించినందుకే తనను పార్టీ నుంచి బయటకు పంపారని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. "అవినీతి చేసిన పందికొక్కులను పక్కన కూర్చోపెట్టుకుని కేసీఆర్ ఆత్మ లేని మరబొమ్మలా మారారు" అని ధ్వజమెత్తారు. కేటీఆర్‌కు రాజకీయ పరిణతి లేదని, ఆయన ఏం మాట్లాడినా ఎవరూ పట్టించుకోరని ఎద్దేవా చేశారు.

### గత ప్రభుత్వ తప్పిదాలకు క్షమాపణ

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను కూడా భాగమైనందుకు సిగ్గుపడుతున్నానని కవిత వ్యాఖ్యానించారు. "మేము అనుకున్న తెలంగాణ రాలేదన్నది వాస్తవం. ఫోన్ ట్యాపింగ్‌లతో వ్యక్తిగత స్వేచ్ఛను హరించారు. ఇసుక దందాలు, రైతులపై బేడీలు వంటి ఘటనలు జరిగినప్పుడు మౌనంగా ఉన్నందుకు తెలంగాణ సమాజానికి క్షమాపణలు కోరుతున్నాను."

### ముగ్గురూ ఒక్కటే..
### రేవంత్ పాలనపై మండిపాటు

రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని కవిత ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను 'హిట్లర్ పాలన'తో పోల్చారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలుస్తుంటే ముఖ్యమంత్రి కర్కోటకుడిలా వ్యవహరిస్తున్నారని, అప్పుడు కేసీఆర్ ఎక్కడికి వెళ్లారని ఆమె నిలదీశారు. ఖమ్మం వెలుగుమట్లలో అర్ధరాత్రి ఇళ్లు కూల్చిన ఘటనలో ఒక గర్భిణీకి అబార్షన్ కావడం తనను కలిచివేసిందని ఆవేదన చెందారు.

### బీజేపీ ఎంపీలకు సవాల్

తెలంగాణపై బీజేపీకి మొదటి నుంచి వివక్ష ఉందని, ఏపీలో కలిపిన 5 గ్రామాలను వెనక్కి తీసుకువచ్చే ధైర్యం రాష్ట్ర బీజేపీ ఎంపీలకు ఉందా? అని ఆమె సవాల్ విసిరారు. సామాజిక న్యాయానికి బీజేపీ బద్ధ వ్యతిరేకి అని దుయ్యబట్టారు. "ముందుంది మొసళ్ల పండగ.. తెలంగాణ ఆత్మను రక్షించే సైన్యంగా 'తెలంగాణ రాష్ట్ర సేన' పని చేస్తుంది" అంటూ కవిత తన ప్రసంగాన్ని ముగించారు.

# బయ్యారంలో అగ్నిప్రళయం

- 10 ఎకరాల్లో బూడిదైన మొక్కజొన్న..
- దిక్కుతోచని స్థితిలో రైతన్న!

**బయ్యారం, ఏప్రిల్ 25, ప్రభాత గమనం:**



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తగూడెం గ్రామంలో పెను విషాదం చోటుచేసుకుంది. ఎండకాలపు సెగకు తోడు, అకస్మాత్తుగా చెలరేగిన అగ్నికీలలు రైతుల నోటికాడి బువ్వను దూరం చేశాయి. శనివారం మధ్యాహ్నం సంభవించిన ఈ భారీ అగ్నిప్రమాదంలో సుమారు 10 ఎకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది.స్థానిక సమాచారం ప్రకారం.. పొలాల్లో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. వేసవి గాలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో నిమిషాల వ్యవధిలోనే మంటలు పక్కపక్క పొలాలకు వ్యాపించాయి. ఆకాశాన్ని తాకుతున్న ఎగిసిపడుతున్న మంటలను చూసి రైతులు, గ్రామస్థులు భీతిల్లారు. వెంటనే అప్రమత్తమైన గ్రామస్థులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ, గాలి వేగానికి అగ్ని జ్వాలలు అదుపులోకి రాలేదు.సమాచారం అందుకున్న వెంటనే ఎస్ఐ తిరుపతి, పోలీస్ సిబ్బంది మరియు ఫైర్ ఇంజన్ సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది, గ్రామస్థులు కలిసి గంటల తరబడి శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ, పొలాల్లోని ఎండుగడ్డి, ఎండ తీవ్రత కారణంగా కొన్ని చోట్ల మంటలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.ఈ ప్రమాదంలో రైతులు దారావత్ హరిలాల్, ఈసం శ్రీకాంత్, రూప్ సింగ్, దేవుసింగ్, రాజు, అంజయ్య, రాంబాబు, చలపతి, రామ్మూర్తి, భద్రయ్య, పాపారావు, వినోద్, నర్సయ్య, రవి, రాందాస్ తదితరుల పంటలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి.సుమారు 10 ఎకరాల మొక్కజొన్న అగ్నికి ఆహుతైంది.పంటతో పాటు సుమారు 50 బోర్లకు సంబంధించిన పైపులు, స్టార్టర్లు, ఇతర సాగు పరికరాలు పూర్తిగా కాలిపోయాయి.లక్షలాది రూపాయల పెట్టుబడి కళ్లముందే బూడిద కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు.

"అప్పులు తెచ్చి, ఎంతో కష్టపడి పంట పండించాం. కోతకు వచ్చే సమయంలో ఇలా అగ్నిపాలవ్వడం మమ్మల్ని కోలుకోలేని దెబ్బ తీసింది." అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆరుగాలం శ్రమించి పండించిన పంట అగ్నిపాలవ్వడంతో చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేయాలని వారు కోరుతున్నారు. యుద్ధ ప్రాతిపదికన నష్టపరిహారం అందించి తమను ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

# స్వయం గణనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

- ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొనేలా విస్తృత ప్రచారం కల్పించాలి
- ఏప్రిల్ 26 నుంచి మే 11 వరకు స్వయం గణన కార్యక్రమం
- ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- ఆన్ లైన్ విధానం ద్వారానే ఇసుక కేటాయింపులు చేయాలి
- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



మహబూబాబాద్,ఏప్రిల్ 25(ప్రభాత గమనం) :

శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దారులు, సంబంధిత అధికారులతో మన జనగణన, మన అభివృద్ధి, స్వయం గణన, ప్రభుత్వ భూముల పరిరక్షణ, సాదా బైనామాల పరిశీలన, మన ఇసుక వాహనం పథకం అమలు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..దేశంలోనే అతిపెద్ద ప్రజా భాగస్వామ్య కార్యక్రమం జనాభా గణన 2027, కార్యక్రమం ప్రారంభం కానున్న నేపథ్యంలో, ప్రతి ఒక్కరూ ఏప్రిల్ 26 ఆదివారం నుండి మే 10 వరకు జిల్లాలో స్వయం గణన కార్యక్రమం కొనసాగుతుందని ఇందులో జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ప్రజలు ప్రతి ఒక్కరూ పాల్గొని వారి యొక్క వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇండ్ల జాబితా గణన, జనాభా గణన మొదటి దశ మే 11, 26 నుండి జూన్ 9 26 వరకు (30) రోజులు కొనసాగుతుందని, ప్రతి ఇంటి సమాచారం నమోదు చేయబడుతుందని, ఇంటి పరిస్థితి సౌకర్యాలు ప్రాథమిక సమాచారం సేకరించబడుతుందన్నారు. స్వయం గణన ఆన్లైన్ పోర్టల్ (se.census.gov.in) వెబ్సైటును సందర్శించి సెల్ఫ్ డిక్లరేషన్ ఐడి పొందాలని, ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు జరిగే గణనలో గుర్తించబడిన ఉద్యోగులు సర్వే నిమిత్తం ఇంటికి వచ్చినప్పుడు మీ ఐడి తెలియపరచాలని తెలిపారు. జనగణన వల్ల ప్రతి ఒక్కరి భవిష్యత్తు కార్యచరణ విధానాలకు ఖచ్చితమైన ఆధారం, వనరుల సరి అయిన పంపిణీ, ప్రణాళికలు, మెరుగైన సౌకర్యాలు పాఠశాలలు, ఆసుపత్రులు, రహదారులు, తమ ప్రాంతాల అభివృద్ధికి సహాయ, సహకారాలు పథకాల అమలు జనాభా గణాంకాలు ద్వారా వెల్లడించడం జరుగుతుందన్నారు. మీ సమాచారం పూర్తిగా సురక్షితంగా ఉంటుందని, జనాభా లెక్కల చట్టం 1948 ప్రకారం మీ సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని, పేర్లు గుర్తింపు బహిర్గతం చేయబడవు, పనులు లేదా ఇతర ఏ దర్యాప్తుల ప్రయోజనాల కోసం ఈ సమాచారాన్ని ఉపయోగించబడదన్నారు. సర్వే సిబ్బంది గుర్తించబడిన వారు వచ్చినప్పుడు ఖచ్చితమైన సంపూర్ణమైన వివరాలు ఇవ్వాలని, మీరు సరియైన సమాచారం భవిష్యత్తులో అనేక విధాలుగా ఉపయోగపడుతుందని జనాభా గణనలో గర్వంగా పాల్గొనాలని, దేశ అభివృద్ధికి సహకరించాలని అన్నారు. జిల్లాలో ఈ జనాభా గణన కార్యక్రమం నిర్వహణ కోసం సుమారు (1764) మంది సిబ్బందిని నియమించడం జరిగిందని వారికి రెండు దఫాలుగా శిక్షణ పూర్తి చేయడం జరిగిందనీ, ఇప్పటికే ప్రింటర్ ఎలక్ట్రానిక్ సోషల్ మీడియా తదితర సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించడం జరుగుతుందని, మరింత ప్రచారం నిర్వహించి ఈ జనాభా గణన కార్యక్రమాన్ని చేయడం కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్క అధికారి మండల స్థాయి అధికారి వారికి కేటాయించిన ప్రకారం సర్వే సిబ్బందికి సహకరిస్తూ ఉండాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ భూములను పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అక్రమంగా అతిక్రమిస్తే చర్యలు తీసుకోవాలని సూచించారు, సాదా బైనామాలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలన్నారు. మన ఇసుక మన వాహనం పథకం ద్వారా ఆన్లైన్ లో మాత్రమే ఇసుక విక్రయాల కూపన్లను పంపిణీ చేయాలని ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి,ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, అన్ని మండలాల తహసిల్దార్లు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, పర్యవేక్షకులు మదన్ గోపాల్, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.



## మైనార్టీ పాఠశాలల్లో 'స్ప్లాష్' సందడి..

- ఉమ్మడి వరంగల్ బాస్కెట్ బాల్ కోచ్ గా నసీరుద్దీన్ నియామకం

కేసముద్రం, ఏప్రిల్ 25( ప్రభాత గమనం) :

తెలంగాణ ప్రభుత్వ 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' (99 రోజుల యాక్షన్ ప్లాన్)లో భాగంగా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'వెల్ఫేర్ వీక్' వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వరంగల్ జక్కలొద్దిలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన 'స్ప్లాష్ సమ్మర్ క్యాంప్' శనివారం అధికారికంగా ప్రారంభమైంది.జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ రమేష్, రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ డాక్టర్ జంగా సతీష్, పాఠశాల ప్రిన్సిపల్ భిక్షపతి, మరియు విజిలెన్స్ అధికారులు అక్బర్ పాషా, మక్బూల్ పాషాలు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా ఈ క్యాంప్ను నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.ఈ సమ్మర్ క్యాంప్కు సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లా బాస్కెట్ బాల్ కోచ్గా కేసముద్రం స్టేషన్కు చెందిన, మహబూబాబాద్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నసీరుద్దీన్ మహ్మద్ను నియమించారు. స్టేట్ మైనార్టీ స్పోర్ట్స్ ఆఫీసర్ సోమేశ్వర ఆదేశాల మేరకు డాక్టర్ జంగా సతీష్ ఈ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. నసీరుద్దీన్ పర్యవేక్షణలో ఉమ్మడి జిల్లా విద్యార్థులకు బాస్కెట్బాల్లో ప్రత్యేక శిక్షణ లభించనుంది.ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఈ క్రింది ప్రాంతాల్లో ఉన్న మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్ బాలుర కోసం ఈ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేయబడింది:పరకాల, భూపాలపల్లి,వరంగల్, హన్మకొండ,జనగాం, వర్ధన్నపేట, మహబూబాబాద్, ఖాజీపేట.వే సవి సెలవుల్లో విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, శారీరక దృఢత్వం మరియు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవడానికి ఈ 'స్ప్లాష్' క్యాంప్ ఒక వేదికగా నిలవనుంది.



## భూవివాదంపై నివేదికను ఎస్సీ, ఎస్టీ కమిషన్కు సమర్పిస్తాం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం ఏప్రిల్ 25 :

గీసుకొండ మండలం సూర్య తండ గ్రామానికి చెందిన అజ్మీర రామ్ దాన్ కుటుంబానికి సంబంధించిన భూమి వివాదంపై పూర్తి స్థాయి నివేదికను ఎస్సీ, ఎస్టీ కమిషన్కు సమర్పిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు.గీసుకొండ మండలంలోని కొమ్మాల గ్రామ శివారులో ఉన్న అసైన్డ్ భూమికి సంబంధించి కుటుంబ తగాదాల నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్కు ఫిర్యాదు అందడంతో, కమిషన్ ఆదేశాల మేరకు సంబంధిత భూమిని అధికారులు పరిశీలించినట్లు కలెక్టర్ వెల్లడించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూమికి సంబంధించిన అన్ని రికార్డులను సమగ్రంగా పరిశీలించి, ఫిర్యాదుదారులు మరియు కొనుగోలుదారుల వాంగ్మూలాలను నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ భూమి ప్రభుత్వ అసైన్డ్ భూమి కావడంతో, ఎవరైనా చట్టవిరుద్ధంగా కొనుగోలు లేదా విక్రయం చేసినట్లు తేలితే, సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే, అక్రమంగా ఇతరులు ఆక్రమణ లేదా కొనుగోలు చేసినట్లు రుజువైతే, ఆ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని స్పష్టం చేశారు.ఈ అంశంపై పూర్తి నివేదికను ఎస్సీ, ఎస్టీ కమిషన్కు సమర్పించి, కమిషన్ నిర్ణయం ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్డీవో సుమ, గీసుకొండ తహసీల్దార్ రియాజుద్దీన్ మరియు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి
- ఎల్కతుర్తి మండలంలో కొనుగోలు కేంద్రాల పరిశీలన

వరంగల్ బ్యూరో, ప్రభాత గమనం ఏప్రిల్ 25 :

మక్కల కొనుగోళ్ళ ను మరింత వేగవంతం చేయాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో మక్కల (మొక్కజొన్నల ) కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సందర్శించారు. కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. మక్కల కొనుగోలు కేంద్రానికి ఎంతమంది రైతులు తమ పంట ఉత్పత్తులను తెచ్చారని, ఇప్పటివరకు ఎంత కొనుగోలు చేశారని నిర్వాహకులను అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మక్కలను విక్రయించేందుకు అక్కడ ఉన్న రైతులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రవి మాట్లాడుతూ మక్కల కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలని సూచించారు. సరిపడ గన్నీ సంచులు కొనుగోలు కేంద్రం వద్ద అందుబాటులో ఉండాలన్నారు. రైతుల నుంచి మక్కలను కొనుగోలు చేసిన వెంటనే లారీల ద్వారా గోదాముకు తరలించాలన్నారు. టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకూడదని సూచించారు. ఈ సందర్భంగా ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంతాజీ, తహసిల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, పిఎసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.





## అబద్ధపు ప్రచారాలు ఆపకపోతే ప్రజాక్షేత్రంలో బుద్ధి చెబుతాం

- ఆరు గ్యారెంటీల అమలుపై నిలదీత...
- కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన బీఆర్ఎస్ నాయకులు

కేసముద్రం ,ఏప్రిల్ 25(ప్రభాత గమనం):

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేక, కేవలం నిందారోపణలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం ఏకైక ఎజెండాగా పెట్టుకుందని బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై లేనిపోని కమిషన్లు వేసి, కేసులతో కోర్టుల చుట్టూ తిప్పాలని చూసిన కాంగ్రెస్ కు హైకోర్టు తీర్పు చెంపపెట్టు అని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పనికిరాని దుష్ప్రచారం చేస్తూ కాలయాపన చేస్తున్నారని, సాంకేతిక సమస్యలను భూతద్దంలో చూపిస్తూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని మండిపడ్డారు."420 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆరు గ్యారెంటీలను గాలికి వదిలేసింది" అని వారు విమర్శించారు.ఉద్యోగ నియామకాలు లేక నిరుద్యోగులు, బకాయిలు రాక రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని, ప్రభుత్వం వారిని ఆత్మహత్యల దిశగా నెట్టేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.మొక్కజొన్న రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని, పంటకు మద్దతు ధరతో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నిరంతర విద్యుత్, నీరు అందించి తెలంగాణను అగ్రస్థానంలో నిలపాలని కోరారు.ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, విధి నిర్వహణలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.రైతులకు, ఉద్యోగులకు ఎలాంటి ఆపద వచ్చినా బీఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాడుతుందని నాయకులు భరోసా ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్ళీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీ శ్రీనాథ్ రెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షులు గుగులోత్ వీరు నాయక్, ఊకంటి యాకూబ్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు జాటోత్ సుజాత హరినాయక్, వినయ్ రెడ్డి, ఆగే రాము, దూదేపాక కృష్ణ, మేకల శారద సురేష్, పైరాల శరత్, పురం రాజమణి రమేష్,కమటం శ్రీను, సర్పంచులు ఈసం లక్ష్మీనారాయణ, ఎదరబోయిన సూరయ్య, బాలాజీ, జ్యోతి శ్రీనివాస్, మాజీ సర్పంచులు హరి రామ్, ముఖ్య నాయకులు పందుల సంజీవ, తోట శీను, బానోత్ వెంకన్న, మాజీ ఎంపిటిసిలు కొమ్ము రాహులు, దుబ్బాక వెంకన్న, చందు, యనమల్ల ప్రభాకర్, రాయుడు, కూన భద్రాద్రి, లింగాల పిచ్చయ్య, బద్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మే 9న వరంగల్ కు ప్రధాని మోడీ రాక...

హైదరాబాద్, ఏప్రిల్ 25(ప్రభాత గమనం):

మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాని మోదీ తొలిసారి తెలంగాణలో పర్యటించనున్నారు. మే 9న ఆయన వరంగల్ మామూనూరు ఎయిర్పోర్టు పనులకు, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, టెక్స్ టైల్ పార్క్, కాజీపేట రైల్వే స్టేషన్ తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో బీజేపీ ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభకు మోదీ హాజరై ప్రసంగించనున్నారు.



## నేటి నుంచి ఆన్ లైన్ జనాభా గణన

హైదరాబాద్, ఏప్రిల్ 25(ప్రభాత గమనం)

తెలంగాణలో తొలిసారిగా జనాభా లెక్కలు నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా జనాభా లెక్కల షెడ్యూల్ ను తెలంగాణ రాష్ట్ర జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి శనివారం నాడు ప్రకటించారు. జనగణన రెండు దశల్లో జరగనుంది. మొదటి దశలో ఏప్రిల్ 26 నుంచి మే 9 వరకు ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేసుకోవాలి. ఆ తర్వాత మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరిస్తారు. తుది దశలో ఫిబ్రవరి 9, 2027 నుంచి ఫిబ్రవరి 28, 2027 వరకు జనగణన నిర్వహిస్తారు. జనాభా లెక్కల సేకరణ పూర్తిగా డిజిటల్ పద్ధతిలో జరుగుతుందని తెలిపారు.



## టీఆర్ఎస్ ఆవిర్భావ సభకు తరలివెళ్లిన శ్రేణులు

కేసముద్రం, ఏప్రిల్ 25(ప్రభాత గమనం):

కొత్త రాజకీయ శక్తిగా ఆవిర్భవిస్తున్న టిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేసముద్రం మరియు ఇనుగుర్తి మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కేసముద్రం మండలం నుంచి గిరగాని శ్యామ్ గౌడ్ ఆధ్వర్యంలో రెండు బస్సులు బయలుదేరి సభకు హాజరయ్యాయి. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన నల్లమాస శ్రీకాంత్ గౌడ్ కి నిర్వాహకులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గిరగాని శ్యామ్ మాట్లాడుతు.కల్వకుంట్ల కవిత నాయకత్వంలో ఏర్పాటైన ఈ నూతన పార్టీ రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పుకు నాంది పలుకుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా పరిష్కరించే లక్ష్యంతో ఈ పార్టీ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. యువతకు అవకాశాలు కల్పించడం, సామాజిక న్యాయం సాధించడం పార్టీ ప్రధాన లక్ష్యాలని అన్నారు. గ్రామీణ అభివృద్ధి, రైతుల సంక్షేమం దిశగా పార్టీ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ఈ పార్టీ పనిచేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.కొత్త రాజకీయ మార్పుకు నాంది పలుకుతున్న ఈ పార్టీ ఆవిర్భావం ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చాకలి ఐలమ్మ వారసురాలు శోభక్క గారు, ఇనుగుర్తి మాజీ సర్పంచ్ బొందయ్య గారు, టీజీఎస్ఎఫ్ నాయకులు హరీష్, మోను, అనిల్, ఆసిఫ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ నేత చల్ల వీరయ్య కన్నుమూత

- నివాళులర్పించిన ధనియకుల రామారావు

గార్ల, ఏప్రిల్ 25: (ప్రభాత గమనం) :

బుద్ధారం గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు చల్ల వీరయ్య (65) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని గార్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధనియకుల రామారావు పేర్కొన్నారు.వీరయ్య మరణవార్త తెలుసుకున్న ధనియకుల రామారావు శనివారం బుద్ధారంలోని ఆయన నివాసానికి చేరుకుని, పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరయ్య పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని, క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా అందరి మన్ననలు పొందారని గుర్తు చేసుకున్నారు.అనంతరం వీరయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. "కాంగ్రెస్ పార్టీ కుటుంబం వీరయ్య గారి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుంది, ఏ కష్టం వచ్చినా ఆదుకుంటాం" అని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ జిల్లా సెక్రెటరీ మంద రాము, జిల్లా ఎస్సీ సెల్ నాయకులు బాపనపల్లి సుందర్, TPCC సోషల్ మీడియా మండల కో-ఆర్డినేటర్ గుడిచుట్టు నవీన్ యాదవ్ పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు గుగ్గులోత్ శ్రీను, జాల లింగస్వామి, సంపాసాల రామకృష్ణ, వెంకన్న, వీరస్వామి, నాగరాజు, నాగముని, నారాయణ, కొమరయ్య, లచయ్య, రామకృష్ణ, మహేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొని వీరయ్యకు నివాళులర్పించారు.




# నిరుపేద విద్యార్థినులకు 'రోటరీ' చేయూత

- 50 సైకిళ్లు పంపిణీ..

మహబూబాబాద్, ఏప్రిల్ 25(ప్రభాత గమనం):

విద్యార్థినుల ఉన్నత చదువులకు దూరం అడ్డంకి కాకూడదనే సంకల్పంతో మహబూబాబాద్ రోటరీ క్లబ్ అభినందనీయమైన కార్యక్రమాన్ని చేపట్టింది. జూబ్లీహిల్స్ రోటరీ క్లబ్ సౌజన్యంతో స్థానిక ఇందిరా పాఠశాల వేదికగా శనివారం 50 మంది నిరుపేద విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్-3150 గవర్నర్ సోమవరపు వెంకటరాంప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు సైకిళ్లను అందజేశారు.ఈ సందర్భంగా గవర్నర్ ఎస్వీ రాంప్రసాద్ మాట్లాడుతూ.. సమాజం పట్ల ఉన్న బాధ్యతను చాటుకోవడంలో మహబూబాబాద్ రోటరీ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని కొనియాడారు. గత 18 ఏళ్లలో సుమారు రూ. 10 కోట్ల విలువైన సేవా కార్యక్రమాలను చేపట్టి తెలంగాణలోనే ఈ క్లబ్ ప్రత్యేక గుర్తింపు పొందిందని ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, కంప్యూటర్ల పంపిణీ వంటివి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నాయని తెలిపారు. మహిళలకు కుట్టుమిషన్లు, వృద్ధులకు వినికిడి యంత్రాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా క్లబ్ తన సేవా దృక్పథాన్ని చాటుకుంటోందని అన్నారు. ముఖ్యంగా పోలియో నిర్మూలనలో, 2 వేల మంది విద్యార్థినులకు రీ-యూజబుల్ శానిటరీ ప్యాడ్ల పంపిణీ వంటి వినూత్న కార్యక్రమాల్లో క్లబ్ పాత్ర స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు అతిథులను బొకేలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నల్ల వెంకట హన్మంత రెడ్డి, వి. బాలకోటి రెడ్డి, పంగులూరి కళ్యాణ్, అసిస్టెంట్ గవర్నర్ సందసాని నరేష్, డిసిసి అధ్యక్షులు ఉమామురళీ నాయక్, బైద్యనాథ్, క్లబ్ అధ్యక్షుడు మాలె నాగేశ్వరరావు, సెక్రటరీ జంగాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.డిస్ట్రిక్ట్ లీడర్లు వద్దుల సురేందర్ రెడ్డి, బిక్కి వెంకటేశ్వర్లు, లీగల్ అడ్వైజర్ తోర్నాల నగేష్ కుమార్, ట్రెజరర్ శంతన్ రామరాజు, సీనియర్ రొటేరియన్లు బోనగిరి గిరిధర్ గుప్తా, బొల్లం శ్రీనివాస్, జంగాల నర్సింహారావు, కళ్లెం వెంకట్ రెడ్డి, లక్ష్మీ నర్సింహారావు, ముల్లంగి మోహన్ రెడ్డి, దూదికట్ల సత్యం, ఓదెల శివకుమార్, వల్లాల రమేష్, వనమాల సురేష్, అచ్చ శ్రీనివాస్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# సందడిగా 'గ్రాడ్యుయేషన్ డే'

- పిల్లల ఎదుగుదలలో అంగన్ వాడీల పాత్ర కీలకం
- కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులు మిట్టగడుపుల యాకూబ్

మహమూద్ పట్నం, ఏప్రిల్ 25: (ప్రభాత గమనం)

గ్రామాల్లోని చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు పట్టుకొమ్మలని, ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్య ఇక్కడే లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు మిట్టగడుపుల యాకూబ్ అన్నారు. శనివారం మహమూద్ పట్నం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులకు 'గ్రాడ్యుయేషన్ డే' వేడుకలను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కట్ల ఎల్లయ్య, ఉప సర్పంచ్ ఏషబోయిన అమృత శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై, చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేశారు.ఈ సందర్భంగా యాకూబ్ మాట్లాడుతూ.. రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అంగన్‌వాడీల బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారని కొనియాడారు.సాధారణ పిల్లలకు బాలామృతంతో పాటు, ఎదుగుదల లోపించిన పిల్లల కోసం ప్రత్యేకంగా 'బాలామృతం+' అందిస్తున్నట్లు తెలిపారు.గర్భిణీ స్త్రీలకు పాలు, గుడ్లు వంటి పౌష్టికాహారాన్ని క్రమంతప్పకుండా అందజేస్తూ మాతా శిశు మరణాల తగ్గింపునకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. 3 నుండి 6 ఏళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీలకు పంపడం ద్వారా వారికి ప్రాథమిక విద్యతో పాటు సామాజిక స్పృహ కలుగుతుందని, ఇది వారి భవిష్యత్తుకు బలమైన పునాది అని వివరించారు.ఈ వేడుకలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ దుర్గా, అంగన్‌వాడీ టీచర్ ముంజాల రమ, ఇతర అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ పిల్లలు గ్రాడ్యుయేషన్ పట్టాలు పుచ్చుకోవడం చూసి తల్లులు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారుల కేరింతలతో అంగన్‌వాడీ ప్రాంగణం కోలాహలంగా మారింది.





# బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి

- భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- జిల్లా పోలీస్ కార్యాలయంలో నెలవారి నేర సమీక్షా సమావేశం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో

భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఆధ్వర్యంలో నెలవారి నేర సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న గ్రేవ్, నాన్-గ్రేవ్, ఎస్సీ/ఎస్టీ, మిస్సింగ్ కేసుల వివరాలను సమగ్రంగా సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన, వేగవంతమైన దర్యాప్తు జరిపి బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. అత్యాచార, పోక్సో కేసులను నిర్ణీత గడువుల్లో పూర్తి చేసి నిందితులను కోర్టు ముందు నిలపాలని స్పష్టం చేశారు. జిల్లాలో లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి పురోగతి సాధించాలని, సీసీ కెమెరాల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో విసిబుల్ పోలీసింగ్ అమలు చేస్తూ ప్రతిరోజూ వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహించినట్లయితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను ఓపికగా విని, సమయానుకూలంగా స్పందించాలని సూచించారు.

ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్ రావు, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.




# ఎక్సైజ్ పోలీసుల మెరుపు దాడి

- వెయ్యి కిలోల నల్లబెల్లం, నాటుసారా స్వాధీనం..

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

తెలంగాణ రాష్ట్రాన్ని గుడుంబా మరియు డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఎక్సైజ్ శాఖ దాడులను ముమ్మరం చేసింది. ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం (IPS), వరంగల్ ఎక్సైజ్ డీసీ జి. అంజన్ రావు ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో భారీగా అక్రమ నిల్వలు పట్టుబడ్డాయి.

**బీదర్ నుంచి రవాణా..**

వరంగల్ ఎన్ఫోర్స్‌మెంట్ బృందానికి అందిన ముందస్తు సమాచారం మేరకు, ఇందిరా నగర్ తండా నుంచి మట్టేవాడ వెళ్లే దారిలో గత రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు.ఈ క్రమంలో TG 26T 3009 నంబర్ గల అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనాన్ని తనిఖీ చేయగా,అందులో అక్రమంగా తరలిస్తున్న 1000 కిలోల నల్లబెల్లం, 100 కిలోల పటిక మరియు 20 లీటర్ల నాటుసారా లభ్యమయ్యాయి.ఈ వ్యవహారంలో భూక్య వీరేందర్ (మహబూబాబాద్ మండలం), గోగులోత్ రవీందర్ (గూడూరు మండలం)లను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు బీదర్ ప్రాంతం నుండి తక్కువ ధరకు నల్లబెల్లం, పటిక తీసుకువచ్చి స్థానిక తండాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారని,అలాగే వారి వద్ద నుండి నాటుసారా సేకరించి పట్టణాల్లో అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని విచారణలో తేలింది.

**మరో ఘటనలో ఒకరి అరెస్ట్..**

గూడూరు ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన రూట్ వాచ్‌లో సర్వపురం తండాకు చెందిన భూక్య రమేష్ అనే వ్యక్తి 6 లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డాడు. అతని వద్ద నుండి నాటుసారాతో పాటు ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నాటుసారా తయారీ,రవాణా చేసే వారిపైనే కాకుండా గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.ఈ దాడుల్లో ఎక్సైజ్ ఏసీ నాగయ్య, సీఐలు నాగయ్య,భిక్షపతి,ఎస్ఐలు రజిత, రాజేశ్వరి ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# హిందూ ధర్మ సమ్మేళనం గోడపత్రిక ఆవిష్కరణ

నర్సంపేట, ప్రభాత గమనం : నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో హిందూ ధర్మ సమ్మేళన సమితి సభాధ్యక్షులు సింగిరికొండ మాధవశంకర్ గుప్తా, గౌరవ అధ్యక్షులు మోతె సమ్మిరెడ్డి, కార్య నిర్వహణ కార్యదర్శి పోలబోయిన మురళీధర్ ఆధ్వర్యంలో హిందూ ధర్మ సమ్మేళనం గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, హిందూ ధర్మ సమ్మేళన సమితి నర్సంపేట డివిజన్ ఉపాధ్యక్షులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ పాల్గొని మాట్లాడుతూ.. భారతదేశం అంటేనే హిందుత్వానికి ప్రతిరూపమని, ప్రతి ఒక్కరూ హిందూ సాంప్రదాయాన్ని రాబోయే తరాలకు అర్థమయ్యేలా పని చేయాలని అన్నారు. మే 5న నర్సంపేట పట్టణంలో జరిగే హిందూ సమ్మేళనానికి హిందువులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు దార్ల రమాదేవి, కమిటీ సభ్యులు గుడిపూడి అరుణ, అయినవోలు కృష్ణమూర్తి, డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మోహన్ రావు, వేములపల్లి సుబ్బారావు, మేడవరపు కమలాకర్ రావు, చింతల కమలాకర్ రెడ్డి ఉన్నారు.

## నిశ్చితార్థం జరిగిన

# యువతి దారుణ హత్య

- అనుమానంతో బావిలోకి నెట్టి చంపిన కాబోయే భర్త..
- ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం..
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ప్రేమించి నిశ్చితార్థం చేసుకున్న యువతిపై అనుమానం పెంచుకున్న ఓ యువకుడు,ఆమెను పథకం ప్రకారం బావిలోకి నెట్టి హత్య చేసిన ఘటన మరిపెడ మండలంలో కలకలం రేపింది.ఈ కేసుకు సంబంధించిన వివరాలను పోలీసులు శనివారం వెల్లడించారు.

**అనుమానమే పెనుభూతమై..**

పోలీసుల కథనం ప్రకారం..మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని కొత్త తండాకు చెందిన అజ్మీరా అరవింద్ (22), ఇటుకలగడ్డ తండాకు చెందిన భూక్యా సంగీత గత రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. రెండు నెలల క్రితమే వీరికి నిశ్చితార్థం జరిగింది.అయితే, సంగీత వేరే వారితో మాట్లాడుతోందని అనుమానం పెంచుకున్న అరవింద్, ఆమెను పెళ్లి చేసుకోకూడదని,ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు.

**పథకం ప్రకారం బావిలోకి నెట్టి..**

ఈ నెల 25న తన ఇంటి వద్ద పండుగ ఉందని నమ్మించి సంగీత తల్లిదండ్రులను పిలిపించాడు.సంగీత ఒక్కతే ఇంట్లో ఉందని గమనించి,ఆమెను తండా బయటకు రమ్మని చెప్పి బైక్‌పై గిరిపురం శివారులోని ఒక బావి వద్దకు తీసుకెళ్లాడు.అక్కడ ఆమెతో మాటల్లో పెట్టి,వెనుక నుండి గట్టిగా బావిలోకి నెట్టివేశాడు.సంగీత మరణించే వరకు బావి వద్దే ఉండి,ఆ తర్వాత అక్కడి నుండి పరారయ్యాడు. మొదట ఈ ఘటన ఆత్మహత్యగా కనిపించినప్పటికీ, పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.సాంకేతిక పరిజ్ఞానం మరియు స్థానిక సాక్షుల ఆధారంగా నిందితుడు అరవింద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు నిజం బయటపడింది.యువతిని బైక్‌పై తీసుకెళ్లిన ఆధారాలు లభించడంతో నిందితుడి పై హత్య కేసు నమోదు చేసి,కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.




## గిర్ని తండా అంగన్‌వాడీ కేంద్రంలో

# ఘనంగా 'ఈసీసీఈ' డే

కేసముద్రం, ఏప్రిల్ 25:( ప్రభాత గమనం) :

పిల్లల సర్వతోముఖాభివృద్ధికి పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకమని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్వైజర్ విజయ పిలుపునిచ్చారు. శనివారం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని గిర్ని తండా అంగన్‌వాడీ కేంద్రంలో 'ఈసీసీఈ డే' (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) వేడుకలను అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, కవితల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సూపర్వైజర్ విజయ, వీఆర్వో రాములు మాట్లాడారు.. మూడు నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు అంగన్‌వాడీల్లో అందించే విద్య వారి భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు.కేంద్రం ద్వారా అందజేసే పాలు, గుడ్లు, ఆకుకూరల్లో అత్యధికంగా మాంసకృత్తులు ఉంటాయని, ఇవి పిల్లల ఎదుగుదలకు ఎంతో అవసరమని తెలిపారు.ప్రతిరోజూ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించి, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఇప్పించడం ద్వారా వారిని దృఢంగా మార్చవచ్చని సూచించారు.గర్భిణీలు, బాలింతలు,కిశోర బాలికలు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ వేడుకలో అంగన్‌వాడీ సిబ్బందితో పాటు లబ్ధిదారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తండావాసులు, కిశోర బాలికలు, గర్భిణీలు, బాలింతలతో పాటు అంగన్‌వాడీ ఆయాలు వెంకటలక్ష్మి , కవిత మరియు స్థానికులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. చిన్నారి పిల్లల ఆటపాటలు, విద్యా సంబంధిత కృత్యాలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



# మావోయిస్టులకు భారీ దెబ్బ

- ఒకేసారి 47 మంది లొంగుబాటు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (ప్రభాత గమనం):

తెలంగాణలో మావోయిస్టు ఉద్యమానికి భారీ విఘాతం కలిగింది. రాష్ట్ర పోలీసు యంత్రాంగం మరియు ప్రభుత్వం అనుసరిస్తున్న పునరావాస విధానాలకు ఆకర్షితులై ఏకంగా 47 మంది అజ్ఞాత మావోయిస్టులు శనివారం డీజీపీ శివధర్ రెడ్డి ముందు లొంగిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీజీపీ వివరాలను వెల్లడించారు.

**కీలక నేతల అడుగులు.. జనజీవన స్రవంతి వైపు**

లొంగిపోయిన వారిలో దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (DKSZC) సభ్యులతో పాటు, దక్షిణ బస్తర్ డివిజనల్ కమిటీకి చెందిన హేమ్లా ఇతు (విజ్జా), పోడియం లచ్చు (మనోజ్) వంటి కీలక నేతలు ఉండటం గమనార్హం. వీరితో పాటు PLGA బెటాలియన్‌కు చెందిన నలుగురు, 9వ మరియు 30వ ప్లాటూన్‌లకు చెందిన 15 మంది సభ్యులు ఉన్నారు.

**భారీగా ఆయుధాల స్వాధీనం**

మావోయిస్టులు లొంగుబాటు సమయంలో తమ వద్ద ఉన్న మారణాయుధాలను పోలీసులకు అప్పగించారు. మొత్తం 32 ఆయుధాలు వీటిలో LMG, AK-47, INSAS, SLR రైఫిల్స్, పిస్టల్స్, రివాల్వర్లు ఉన్నాయి). మందుగుండు: 515 తూటాలు.

**నిర్వీర్యమైన దక్షిణ బస్తర్ డివిజన్**

ఈ భారీ లొంగుబాటుతో దక్షిణ బస్తర్ డివిజన్ ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్యమైందని డీజీపీ పేర్కొన్నారు. గత రెండేళ్లలో పోలీసుల వ్యూహాల వల్ల 818 మంది మావోయిస్టులు లొంగిపోయారని, ఇది రాష్ట్రంలో మారుతున్న పరిస్థితులకు అద్దం పడుతోందని ఆయన



తెలిపారు.

**అజ్ఞాతంలో ఉన్న వారు లొంగిపోండి : డీజీపీ**

"ఇంకా అడవిలోనే ఉన్న గణపతి, సంతోషం, సుజాత, మంగు వంటి నేతలు కూడా హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలి. ప్రభుత్వం కల్పిస్తున్న మెరుగైన పునరావాస ప్యాకేజీలను సద్వినియోగం చేసుకుని ప్రశాంత జీవితం గడపాలి" అని డీజీపీ శివధర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ తోడ్పాటుతో మావోయిస్టు ప్రభావం రాష్ట్రంలో క్రమంగా తగ్గుముఖం పడుతోందని ఆయన స్పష్టం చేశారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374